


# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 27-10-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 41 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# పేదవాడి విజయానికి ఈ యాత్ర బాటలు వేయాలి

## రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



గుంటూరు, (విజయభాను న్యూస్) : ఏపీ అధికార పక్షం వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రపై ఆ పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. ఈ నాలుగేళ్లలో జరిగిన సామాజిక న్యాయాన్ని బస్సు యాత్రలో ఎలుగెత్తి చాటాలని, తద్వారా రాబోయే రోజుల్లో పెత్తందారులతో జరిగే యుద్ధంలో పేదవాడి విజయానికి బాటలు వేయాలని ఆకాంక్షించారాయన."మన ప్రభుత్వంలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీలకు కల్పించిన ప్రాధాన్యత ఈ రాష్ట్ర చరిత్రలోనే కాదు, దేశచరిత్రలోకూడా మునుపెన్నడూ చూడనిది. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రగతిని ఒక హక్కుగా మన ప్రభుత్వం వారికి అందించింది. గత 53 నెలల కాలంలో రూ. 2.38 లక్షల కోట్ల డీబీటీలో 75శాతం ఈ వర్గాలకు చేరడమే దీనికి నిదర్శనం. చట్టం చేసి నామినేటెడ్ పదవుల్లో 50శాతం ఈ వర్గాలకు ఇస్తూ పట్టం కట్టిన ప్రభుత్వంకూడా మనదే. పెత్తందారీ పోకడలున్న వ్యక్తులు, శక్తులు అడుగడుగునా అడ్డుపడ్డా ఎక్కడా వెనకడుగు వేయలేదు. రాబోయే రోజుల్లోకూడా పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరగబోతోంది. ఈరోజు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "సామాజిక సాధికార యాత్ర" ద్వారా వీరంతా ఏకమై మన ప్రభుత్వంలో జరిగిన సామాజిక న్యాయాన్ని ప్రతిధ్వనించాలి. పేదవాడి విజయానికి బాటలు వేయాలి " అని సీఎం జగన్ తన ట్వీట్‌లో ప్రస్తావించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు.. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు సిద్ధమైంది. ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం, దక్షిణ కోస్తాలో తెనాలి, రాయలసీమలో శింగనమల నుంచి ఈ యాత్ర ప్రారంభం అయ్యింది. నేటి నుంచి నవంబర్ 9 వరకు మొదటి విడత బస్సుయాత్ర జరగనుంది.

ఆదివారాలు మినహా రోజూ రాష్ట్రవ్యాప్తంగా 3 ప్రాంతాల్లో ప్రతిరోజూ యాత్ర ఉంటుంది. మొత్తంగా డిసెంబర్ 31 వరకూ 60 రోజుల పాటు సభలు జరుగుతాయి. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ యాత్రను నిర్వహించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు ఈ యాత్రలో పాల్గంటారు. జగనన్న పాలనలో జరిగిన అభివఅద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ఉద్దేశం. ఎమ్మెల్యేలు, స్థానిక సమన్వయకర్తలు ఈ బస్సు యాత్రకు అధ్యక్షత వహిస్తారు.

**బస్సు యాత్ర షెడ్యూల్**

అక్టోబర్ 26 –ఇచ్ఛాపురం, తెనాలి, శింగనమల
అక్టోబర్ 27 – గజపతినగరం, నరసాపురం, తిరుపతి
అక్టోబర్ 28– భీమిలి, చీరాల, పొద్దుటూరు
అక్టోబర్ 30 – పాడేరు, దెందులూరు, ఉదయగిరి
అక్టోబర్ 31– ఆముదాలవలస, నందిగామ, ఆదోని
నవంబర్ 1 – పార్వతీపురం, కొత్తపేట, కనిగిరి
నవంబర్ 2 – మాడుగుల, అవనిగడ్డ, చిత్తూరు
నవంబర్ 3 –నరసన్నపేట, కాకినాడ రూరల్, శ్రీకాళహస్తి
నవంబర్ 4 – శృంగవరపుకోట, గుంటూరు ఈస్ట్, ధర్మవరం
నవంబర్ 6 – గాజువాక, రాజమండ్రి రూరల్, మార్కాపురం
నవంబర్ 7 –రాజాం, వినుకొండ, ఆళ్లగడ్డ

తరువాయి 2లో..

# రైతుల పేరుతో రాజకీయాలు చేస్తారా

## ప్రధాని నరేంద్ర మోదీ



మహారాష్ట్ర : ప్రధాని నరేంద్ర మోదీ తాజాగా నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన పేరు ప్రస్తావించకుండా, పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రైతుల పేరుతో ఆయన రాజకీయాలు చేశారని ఆరోపణలు గుప్పించారు. ఆయన చాలా సంవత్సరాల పాటు వ్యవసాయ మంత్రిగా ఉండి కూడా రైతులకు ఏం చేయలేకపోయారని, సమయానికి రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని వ్యాఖ్యానించారు. ఆ రోజుల్లో రైతులు మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చేదని అన్నారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో గురువారం పలు ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం తన ప్రసంగంలో మోదీ ఈ విధంగా శరద్ పవార్‌పై ధ్వజమెత్తారు. "మహారాష్ట్రకు చెందిన ఒక సీనియర్ నాయకుడు కేంద్ర ప్రభుత్వంలో చాలా సంవత్సరాల పాటు వ్యవసాయ మంత్రిగా ఉన్నారు. నేను వ్యక్తిగతంగా ఆయన్ను గౌరవిస్తాను. కానీ.. ఆయన రైతులకు ఏం చేశాడు. తన ఏడేళ్ల పదవికాలంలో ఆయన దేశవ్యాప్తంగా రైతుల నుండి కేవలం రూ. 3.5 లక్షల కోట్ల విలువైన ధాన్యాన్ని ఎంఎస్‌పీకి కొనుగోలు చేశాడు. కానీ.. ఆ ఏడేళ్ల కాలంలోనే మా ప్రభుత్వం రూ. 13.5 లక్షల కోట్లు రైతులకు ఇచ్చింది" అని మోదీ చెప్పుకొచ్చారు. 2014కి ముందు కేవలం రూ.500–600 కోట్ల పప్పులు, నూనె గింజలు మాత్రమే ఎంఎస్‌పీపై కొనుగోలు చేశారని.. కానీ తమ ప్రభుత్వం రూ. 1 లక్షా పదిహేను వేల కోట్లకు పైగా డబ్బులను పప్పులు, నూనె గింజల రైతులకు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు. ఆయన (శరద్ పవార్' వ్యవసాయ మంత్రిగా ఉన్నప్పుడు రైతులు తమ డబ్బు కోసం మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చేదని.. ఆ రోజుల్లో నెలల తరబడి రైతులకు

తరువాయి 2లో..

# వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం

శ్రీకాకుళం : ఇచ్ఛాపురం నుంచి వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభించడం సంతోషంగా ఉందని ఆ పార్టీ నేతలు అన్నారు. గురువారం.. ఇచ్ఛాపురంలో మంత్రి బొత్స సత్యనారాయణ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే వి.కళావతి, గొర్లె కిరణ్ కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, వరదు కల్యాణి పాల్గొన్నారు.



# 8 మంది.. భారత నేవీ మాజీ అధికారులకు మరణశిక్ష



దిల్లీ: భారత్‌కు చెందిన ఎనిమిది మంది నౌకాదళ మాజీ అధికారులు కొన్ని నెలల నుంచి ఖతార్ నిర్బంధంలో ఉన్న విషయం తెలిసిందే. తాజాగా వీరికి అక్కడి కోర్టు మరణశిక్ష విధించింది. గూఢచర్యం ఆరోపణలపై వీరికి ఈ శిక్ష పడినట్లు సమాచారం. ఎనిమిది మంది భారతీయులకు మరణశిక్ష పడినట్లు వార్తలు రావడంపై భారత విదేశాంగశాఖ స్పందించింది. ఈ వార్త తమనెంతో దిగ్భ్రాంతికి గురిచేసిందని.. దీనిపై న్యాయపోరాటం చేస్తామని వెల్లడించింది. 'నేవీ మాజీ అధికారులకు ఖతర్ కోర్టు మరణశిక్ష విధించిందన్న విషయం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ తీర్పునకు సంబంధించి పూర్తి సమాచారం కోసం వేచిచూస్తున్నాం. బాధితుల కుటుంబ సభ్యులతోపాటు

తరువాయి 2లో..




# భయపడొద్దు.. కలిసికట్టుగా పోరాడుదాం : భువనేశ్వరి



తిరుపతి: తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును 48 రోజులుగా జైల్లో పెట్టారని ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు చాలా ధైర్యవంతుడని, ఆయన్ను ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ప్రజలంతా రోడ్లపైకి వచ్చి పోరాడుతున్నారన్నారు. తిరుపతిలో నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఎప్పుడూ కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లే వాళ్లం. నిన్న మాత్రం ఒంటరిగా తిరుమలకు వెళ్లాల్సి వచ్చింది. చంద్రబాబు అరెస్టుతో మా కుటుంబసభ్యులం మొత్తం నాలుగు దిక్కులుగా విడిపోయాం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

"అనంతపురానికి చంద్రబాబు కియా మోటార్స్, తిరుపతికి ఫాక్స్‌కాన్ కంపెనీలు తీసుకొచ్చారు. ఈ ప్రభుత్వం పెట్టే బాధలు తట్టుకోలేక రాష్ట్రానికి రావాల్సిన కంపెనీలు పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. ఇక్కడి యువతకు దక్కాల్సిన ఉద్యోగాలన్నీ వేరే రాష్ట్రాలకు పోతున్నాయన్నదే నా బాధ. 30 ఏళ్ల అనుభవం ఉన్న

తరువాయి 2లో..

# ఉప రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

## ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లిఖార్జున

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఈ నెల 28న జరిగే ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖపట్టణం పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు, ఇ ండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆంధ్ర వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించే శత వసంతాల వేడుకకు ఆయన హాజరవుతున్నారని పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమ నిర్వహణకు అన్ని విభాగాల అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. 28వ తేదీ ఉదయం విశాఖపట్టణం చేరుకున్నప్పటి నుంచి కార్యక్రమం ముగిసి ఆయన తిరుగు పయనమయ్యే వరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అత్యంత పటిష్టమైన భద్రతా పరమైన చర్యలు చేపట్టాలని పోలీసు



అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది, మెడికల్ ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉంచుకోవాలని డీఎం హెచ్‌వోను ఆదేశించారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో కార్యక్రమాలు జరిగే క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,

తరువాయి 2లో..

# ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యం



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు అన్నారు . మండలంలో మడుతూరు గ్రామంలో గురువారం ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు . ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా చూడాలన్నదే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు.

అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహించే వైద్య పరీక్షలు గురించి వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు . ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి , కో జడ్పిటిసి నర్మాల కుమార్ , మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , సర్పంచ్ కూండ్రపు విమల నాయుడు , సర్పంచ్ మోటూరు సంజీవ్ , ఎంపీటీసీ శనివాడ జువ్వాలనాయుడు , ఎంపీటీసీ లాలం శ్రీను , సచివాలయ కన్వీనర్ తోట వెంకటేష్ , అధికారులు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాఖ రురల్ :మధురవాడ (విజయభాను న్యూస్) : జోన్ - 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు పీ ఎం పాలెం సబ్ స్టేషన్ పరిధిలో గల 11కెవి పెప్సీ ఫీడర్ పై మరమ్మత్తులు మరియు చెట్లు తొలగింపు అలాగే రహదారి విస్తరణ కారణముగా స్థంబాల మార్పిడి నిమిత్తం శుక్రవారం బాబా నగర్ ప్రాంతం, విజేత సూపర్ మార్కెట్ ప్రాంతం, కార్ షెడ్ ఏరియా,45 సచివాయలం పరిధి తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించగలరని పీఎం పాలెం సబ్ స్టేషన్ ఏ.ఈ.ఈ మండల అప్పల నాయుడు ఒక ప్రకటనలో కోరారు.

## చంద్రగ్రహణం సందర్భంగా శ్రీ ముఖలింగేశ్వర ఆలయం మూసివేత



జలుమూరు(విజయభాను న్యూస్) : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ ముఖలింగేశ్వర క్షేత్రంలో పాక్షిక చంద్రగ్రహణం కారణంగా ఈనెల 28న సాయంత్రం ఐదు గంటల నుండి మరుసటి రోజు ఉదయం ఐదు గంటల శ్రీ ముఖలింగేశ్వర ఆలయ ముఖ్యద్వారాలు మూసివేయనున్నాము.. 29 న ఉదయం ఐదు గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ప్రాతఃకాల పూజలు అనంతరం ఉదయం ఏడు గంటల నుండి దర్శనాలు, ప్రత్యేక పూజలు, ఇతర ఆర్జిత సేవలు ప్రారంభం కానున్నాయి. స్వామి వారి భక్తులు ఈ విషయాన్ని గమనించగలరు... ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్

## రూరల్ జనసేన పార్టీ అధ్యక్షులు పంచకర్లను కలిసిన రాజు



పరవాడ:- విశాఖ రూరల్ జనసేన పార్టీ అధ్యక్షులుగా ఇటీవలే పెందుర్తి మాజీ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబును నియమించిన సంగతి అందరికీ తెలిసిందే.. ఈ మేరకు గురువారం ఆయన్ని 79 వార్డ్ జనసేన నాయకులు సర్వసిద్ధి సన్యాసిరాజు ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియపరిచారు.. అనంతరం దుస్సాల వాతో సత్కరించారు..

# పాన్' లేకుండా నగదు బట్వాడా.. బ్యాంకులకు కొత్త నిబంధన




పెరంబూర్(చెన్నై): పాన్‌కార్డు లేని వారి నుంచి, స్వీయ వివరాలు సేకరించిన తర్వాతే నగదు పరివర్తనకు అనుమతించాలని బ్యాంకులకు ఆదాయపన్ను శాఖ తెలియజేసింది. ఒకసారి రూ.50 వేలు, అంతకు పైగా నగదు పరివర్తన చేపట్టే వారి నుంచి పాన్ కార్డు నెంబరు స్వీకరించి బ్యాంకు ఉద్యోగులు నగదు బట్వాడా చేపడుతున్నారు. అదే సమయంలో రూ.50 వేలకు పైగా నేరుగా నగదు బట్వాడా చేయవద్దనే ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో, పలు బ్యాంకులు తమ వినియోగదారుల నుంచి పాన్ లేకుండా రూ.50 వేలకు పైగా నగదు నేరుగా బట్వాడా చేస్తున్నాయి. ఈ విషయంపై దృష్టి సారించిన ఆదాయపన్ను శాఖ, పాన్ లేని వినియోగదారుల ఆధార్ నెంబరు, బ్యాంక్ ఖాతా నెంబరు, చిరునామా, రిజిస్టర్ మొబైల్ నెంబరు తదితర స్వీయ వివరాలు సేకరించిన తర్వాతే నేరుగా నగదు బట్వాడాకు అనుమతించవచ్చుని పేర్కొంది.

# డబుల్ డెక్కర్ రద్దు.. పలు రైళ్లు దారి మళ్లింపు




విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** దక్షిణ మధ్య రైల్వేపరిధిలోని విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దయ్యాయి. డివిజన్ పరిధిలోని భద్రతా పనుల కారణంగా ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దైన వాటిలో ప్యాసింజర్ సహా, ఉదయ్ డబుల్ డెక్కర్ రైలు ఉన్నాయి. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో రాజమండ్రి - విశాఖ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును (07466) పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా తేదీల్లో తిరుగు ప్రయాణం అయ్యే రైలు (07467) కూడా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విశాఖపట్నం - విజయవాడ మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పేరుతో నడిచే డబుల్ డెక్కర్ (22701) రైలును 27, 28 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుగు ప్రయాణమయ్యే రైలు కూడా అయా తేదీల్లో అందుబాటులో ఉండదని పేర్కొన్నాయి. వీటితో పాటు 26, 27, 28 తేదీల్లో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం- కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణం అవుతుంది. అలాగే హౌరా - జగ్దల్‌పూర్ సామలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాగఢ్ నుంచి హౌరాకు తిరిగి ప్రయాణం అవుతుంది. భువనేశ్వర్-జగ్దల్‌పూర్ హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ (18447) కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణం అయ్యి భువనేశ్వర్ చేరుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

# భారత్ నిర్ణయాన్ని స్వాగతించిన కెనడా

టొరంటో : వీసా సర్వీసుల్ని పునరుద్ధరించాలన్న భారత్ నిర్ణయాన్ని కెనడా స్వాగతించింది. ఖలిస్తాన్ వేర్పాటువాది నేత నిజ్జర్ హత్య విషయంలో భారత్ కెనడాల మధ్య దౌత్య వివాదం తలెత్తిన సంగతి తెలిసిందే. దీంతో వీసాల జారీ ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు భారత్ ప్రకటించింది. అయితే గురువారం నుండి వీసాలను పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు కెనడాలోని భారత హైకమిషన్ పేర్కొంది. దేశవ్యాప్తంగా మరియు విదేశాల నుండి దరఖాస్తు చేసుకునే కెనడియన్ల కోసం కొన్ని రకాల వీసాను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఎంట్రీ వీసా, బిజినెస్ వీసా, మెడికల్ వీసా, కాన్ఫరెన్స్ వీసా సేవలను పునరుద్ధరించాలని నిర్ణయించామని ఒట్టావాలోని భారత్ హైకమిషన్ తెలిపింది.

ఈ నిర్ణయంపై కెనడా ఇమ్మిగ్రేషన్ మినిస్టర్ మార్క్ మిల్లర్ స్పందించారు. భారత్‌తో దౌత్యపరమైన వివాదం ఎన్నో వర్గాల్లో ఆందోళన సృష్టించిందని అన్నారు. ఈ సమయంలో కెనడియన్‌లకు ఇది సానుకూల సంకేతమని పేర్కొన్నారు. ఆయన భారత్ నిర్ణయంపై మరో మంత్రి హర్జిత్ సజ్జన్ కూడా స్పందించారు. ఇది మంచి నిర్ణయమని, ఆందోళనకర సమయాల్లో వీసాల రద్దు మొదటి నిర్ణయం కాకూడదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ నిజ్జర్ హత్య విచారణలో భారత్ సాయం కోరుతున్నామని అన్నారు.

# పాడిరైతులకు అందుబాటులో హెరిటేజ్ సేవలు

జోనల్ మేనేజర్ వి దివాకరరావు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : పాడిరైతులకు అందుబాటులో సేవలు అందించేందుకు నూతన పాలసేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు హెరిటేజ్ డెయిరీ జోనల్ మేనేజర్ వి దివాకరరావు అన్నారు . గురువారం రాంబిల్లి మండలం కేడి పాలెం గ్రామంలో హెరిటేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన పాల సేకరణ కేంద్రాన్ని , ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు . ఉచితంగా మందులు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డెయిరీల కంటే పాలుకు అధిక రేటు చెల్లిస్తు , పాడిరైతుల అభివృద్ధి కోసం హెరిటేజ్ డెయిరీ పాటుపడుతుందన్నారు . పాడిపశువుల కృత్రిమ గర్భధారణకు రూ. 50 , ఆడ పెయ్యి పుట్టేందుకు 500 రూపాయలకే సేవలందిస్తున్నట్లు తెలిపారు . డెయిరీలో సభ్యత్వం ఉన్న పాడిరైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 2 లక్షలు , సహజ మరణం అయితే రూ. 50,000 అందిస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు , మేనేజర్ కూండ్రపు శేషు , వైద్యులు మనోజ్ కుమార్ రెడ్డి , పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు .

# పేదవాడి విజయానికి ఈ యాత్ర బాటలు వేయాలి

నవంబర్ 8 - సాలూరు, పాలకొల్లు, నెల్లూరు రూరల్
నవంబర్ 9 - అనకాపల్లి, పామర్రు, తంబళ్లపల్లె

ఆదివారాలు మినహా రోజూ రాష్ట్రవ్యాప్తంగా 3 ప్రాంతాల్లో ప్రతిరోజూ యాత్ర ఉంటుంది. మొత్తంగా డిసెంబర్ 31 వరకూ 60 రోజుల పాటు సభలు జరుగుతాయి. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఈ యాత్రను నిర్వహించనున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ నాయకులు ఈ యాత్రలో పాల్గొంటారు. జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ఉద్దేశం. ఎమ్మెల్యేలు, స్థానిక సమన్వయకర్తలు ఈ బస్సు యాత్రకు అధ్యక్షత వహిస్తారు.

# రైతుల పేరుతో రాజకీయాలు చేస్తారా

డబ్బులు చెల్లించలేదని ప్రధాని మోదీ ఆరోపించారు. తమ ష్రభుత్వం మాత్ర రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా ఎంఎస్‌పీ సొమ్ము వచ్చేలా ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. చెరుకు రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చక్కెర మిల్లులు, సహకార సంఘాలకు వేల కోట్ల రూపాయల సాయం కూడా అందించామన్నారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. రైతులు ఇప్పుడు తమ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే పొందుతున్నారని ప్రధాని మోదీ చెప్పుకొచ్చారు.

# భయపడొద్దు.. కలిసికట్టుగా పోరాడుదాం : భువనేశ్వరి

అమరరాజా సంస్థను వైకాపా ప్రభుత్వం చాలా ఇబ్బందులు పెట్టింది. దీంతో ఆ సంస్థ పక్కరాష్ట్రంలో రూ.9,300 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. హైదరాబాద్‌లో ఐఎస్‌బీ సంస్థ ఏర్పాటు కోసం చంద్రబాబు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రానికి ఒక్క కొత్త కంపెనీ అయినా వచ్చిందా. ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా?

చంద్రబాబు రాజకీయ జీవితం తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ నుంచే ప్రారంభమైంది. ఆయన ఆదేశాలతోనే బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్నాను. దసరా శుభాకాంక్షలు చెబుతూ చంద్రబాబు లేఖ రాస్తే.. ప్రభుత్వానికి పనిలేనట్టు దానిపై కూడా విచారణ చేస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధిపై కాకుండా.. లేఖపై విచారణ చేస్తూ సమయం వృథా చేస్తున్నారు. ఏ తప్పూ చేయకున్నా చంద్రబాబును అరెస్టు చేశారు.. చివరికి న్యాయమే గెలుస్తుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గొప్పతనం ఏంటి అంటే? అరెస్టులు, కేసులతో వేధించడం. ఇందులోనే ఏపీ నంబర్ వన్ స్థానంలో ఉంది. మహాత్మా గాంధీ ఆనాడు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తే, మనం.. వైకాపా ప్రభుత్వం నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాల్సి వస్తోంది. మనం చేసే పోరాటం భవిష్యత్తు కోసమే. తెదేపా కార్యకర్తల్ని భయపెట్టేందుకు అక్రమ కేసులు పెడుతున్నారు. ఎవరూ భయపడొద్దు.. కలిసికట్టుగా పోరాడుదాం" అని భువనేశ్వరి పిలుపునిచ్చారు.

## 8 మంది.. భారత నేవీ మాజీ అధికారులకు మరణశిక్ష

న్యాయ బృందంతో టచ్‌లో ఉన్నాం. చట్టపరంగా ఉన్న అన్ని అవకాశాల కోసం అన్వేషిస్తున్నాం. ఈ కేసుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ తీర్పునకు సంబంధించిన విషయాన్ని ఖతర్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం' అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. గోప్యతకు సంబంధించిన కారణాల దృష్ట్యా ఈ కేసుపై ప్రస్తుతం ఎక్కువగా వ్యాఖ్యానించలేమని తెలిపింది.

అసలేం జరిగిందంటే..?

భారత్‌కు చెందిన ఎనిమిది మంది నౌకాదళ మాజీ అధికారులు అల్ దహ్రా సంస్థలో పనిచేస్తున్నారు. ఖతర్ సాయుధ దళాలకు శిక్షణ, ఇతర సేవలు అందించే ఈ సంస్థను ఒమన్‌కు చెందిన ఓ మాజీ వైమానిక దళం అధికారి నిర్వహిస్తున్నారు. అయితే, భారత్‌కు చెందిన ఈ ఎనిమిది మందిని ఖతర్ అధికారులు ఆగస్టు 2022లో నిర్బంధంలోకి తీసుకున్నారు. సబ్‌మెరైన్ కార్యక్రమాల్లో గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో వీరిని నిర్బంధించినట్లు తెలిసింది.

అయితే, వీరంతా భారత అధికారులతో మాట్లాడేందుకు ఖతర్ అనుమతి ఇచ్చింది. దీంతో భారత విదేశాంగ శాఖ అధికారులు కలవడంతోపాటు ఖతర్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. అదే సమయంలో పలుమార్లు బెయిల్‌కు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. వీరి నిర్బంధాన్ని ఖతర్ ప్రభుత్వం పొడిగించింది. చివరకు ఈ కేసు కోర్టులో విచారణకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఎనిమిది మందికి తాజాగా అక్కడి న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది.

# ఉప రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

నావీ అధికారులతో సమన్వయం వ్యవహరించాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో ఎక్కడైనా సుందరీకరణ చేపట్టాల్సిన పనులు ఉంటే త్వరితగతిన చేయాలని, పోర్టు రోడ్డులో దుమ్ము, ధూళి లేకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ దీపాలు అమర్చాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గార్డు ఆఫ్ ఆనర్ ఇతర సంప్రదాయక కార్యక్రమాల నిర్వహణలో నావీ, పోలీసు శాఖ అధికారులు సమన్వయం వహించాలని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం వ్యవహరించి ఉప రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ. రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఆర్డీవోలు, ఇతర విభాగాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లోకి చొరబాటుకు యత్నం.. ఐదుగురు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్: భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాలను మన భద్రతా దళాలు సమర్థంగా తిప్పికొట్టాయి. కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో మచిల్ వద్ద నియంత్రణ రేఖ వెంబడి భారత్‌లోకి అక్రమంగా చొరబడేందుకు కొందరు ముష్కరులు చేసిన కుట్రల్ని పోలీసులు, సైన్యం సంయుక్త ఆపరేషన్‌తో భగ్నం చేశారు. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు మృతిచెందారు. వీరంతా లష్కరే తోయిబా ఉగ్ర సంస్థకు చెందిన వారిగా గుర్తించినట్లు జమ్మూకశ్మీర్ అదనపు డీజీ విజయ్ కుమార్ వెల్లడించారు. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోంది.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల చొరబాటు నిరోధక ఆపరేషన్లలో పోలీసు బలగాల్ని సైతం వినియోగిస్తున్నారు. కశ్మీర్‌కు చెందిన పోలీసులు, సెక్యూరిటీ ఏజెన్సీలు శ్రీనగర్‌లోని 15 కార్ప్స్‌లో బుధవారం భేటీ అయ్యారు. ఈ ఏడాది 46 మంది ఉగ్రవాదులు హతమవ్వగా.. వారిలో 37మంది పాకిస్థానీలు కాగా.. తొమ్మిది మంది స్థానికంగా ఉన్నవారేనని ప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి.

# జివిఎంసి క్రికెట్ జట్టు ఘన విజయం



విశాఖపట్నం అక్టోబర్ 26:- మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ క్రికెట్ జట్టు ఘన విజయం సాధించిందని జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ విడిసిఏ-బి మైదానంలో జరిగిన జివిఎంసి, ఎంఓవి జట్ల మధ్య వీడిసిఏ ఇన్స్టిట్యూషన్స్ పూల్ సి మ్యాచ్లో జివిఎంసి జట్టు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిందని తెలిపారు. మొదటగా బ్యాటింగ్ చేసిన ఎంఓవి జట్టు నిర్ణీత 18 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి138 పరుగులు చేసిందన్నారు. ఎంఓవి తరపున సతీష్ 21 పరుగులు, రాకేష్ 27 పరుగులు, సురేష్ 33 పరుగులు చేశారని, జివిఎంసి తరపున అనిల్, సునంద్, కెప్టెన్ శివ తలా రెండు వికెట్లు తీయగా, బదులుగా జివిఎంసి జట్టు 15.2 ఓవర్లలో 140 పరుగులు సాధించి లక్ష్యాన్ని పూర్తి చేసి ఘన విజయం సాధించిందని తెలిపారు. జివిఎంసి తరపున రామ్ సతీష్ 21, జి. శ్రీను 46 పరుగులు సాధించి జివిఎంసి విజయంలో కీలక పాత్ర పోషించారని, ఎంఓవి తరపున రాకేష్ 2, శివకృష్ణ 2 వికెట్లు సాధించారని తెలిపారు. జివిఎంసి జట్టు విజయంలో ముఖ్య పాత్ర పోషించిన జి.శ్రీనివాస్ ను అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు టీమ్ మేనేజర్ సన్నీ అభినందించారు.

# ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ

శ్రీకాకుళం అక్టోబరు 26 : జిల్లాలో ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణ ఈ నెల 27న జరగనుందని, వాటిలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని రెవెన్యూ అధికారి వారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో 15వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు మాట్లాడుతూ ఓటరు లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించుకోవాలని వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఫారం 6, 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని, ముసాయిదాలోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27వ తేది నుండి డిసెంబరు 9వ తేది వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు.

డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించడం జరుగుతుందని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషను ఆదేశాలమేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఆయా తేదీలను ముందుగా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి తప్పుడు ఫారం 7 లు అందజేస్తే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. బ్యాలెట్ యూనిట్ లు 7530, కంట్రోల్ యూనిట్లు 5850, వివిపాట్ లు 7070 జిల్లాకు చేరాయని చెప్పారు. మొదటి దశ తనిఖీల ప్రకారం 7523 బ్యాలెట్ యూనిట్లు గాను 2440, 5831 కంట్రోల్ యూనిట్లు గాను 2020, 7105 వివిపాట్ లు గాను 2300 పూర్తిగా పనిచేసున్నాయని అన్నారు.బ్యాలెట్ యూనిట్లు 4, కంట్రోల్ యూనిట్లు 8, వివిపాట్లు 24 తిరస్కరించడం జరిగిందని, తిరస్కరించిన వాటిని వెనుకకు పంపించడం జరుగుతుందని అన్నారు.

ఈ వి ఎమ్ ల వినియోగంలో ఎటువంటి అపోహలు ఉన్నా నిపుణులు నివృత్తి చేస్తారని తెలిపారు. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేస్తే వాటిని సరిదిద్దుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, శుద్ధమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయపార్టీలు, ప్రజలు సహరించాలని కోరారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి దేసెల్ల గోవింద మల్లి బాబు,సి పి ఐ పార్టీ ప్రతినిధి బి. కృష్ణమూర్తి, సి పి యం పార్టీ ప్రతినిధి డి. గోవిందరావు, సెక్షన్ సుపరెడెంట్ ప్రకాష రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



సాలూరు విజయభాను న్యూస్ అక్టోబర్ 26 : సాలూరు పురపాలక సంఘం పరిధిలో గురువారం 9వ సచివాలయం గాంధీ నగర్ 2 యందు 18 మరియు 19 వార్డు లు సంబంధించి గవర్నమెంట్ జూనియర్ కాలెజి లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించబడినది. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అకస్మితంగా తనిఖీ చేశారు. జేఏఎస్ కౌంటర్ రిజిస్ట్రేషన్ టోకెన్ జారీ విధానం వైద్యులు సిబ్బంది హాజరు చికిత్స కోసం వచ్చిన ప్రజలు వైద్య సేవలను ఇష్టంగా పరిశీలించారు. ప్రజలకు ఇంటి వద్ద ఏడు రకాలైన వైద్య పరీక్షలు బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగ్యూ, కఫం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు జిల్లా వ్యాప్తంగా 84 మంది ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొన్నారు అని తెలిపారు. ఇందులో స్త్రీలకు, చిన్న పిల్లలకు, ఎముకలకు, కంటి తనిఖీలకు ప్రత్యేక డాక్టర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి చైర్ పర్సన్ వారు ప్రసంగిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో ప్రజలు అందరూ హెల్త్ పరీక్షలు చేసుకుని వారి ఆరోగ్యం పై పూర్తి అవగాహన కల్పించు కోవాలని మన ప్రియతమ నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇటువంటి ఆరోగ్య సురక్ష కార్యక్రమం లు ప్రవేశపెట్టి ప్రజలు మన్ననలు పొందుతున్నారని శ్లాఘించారు ఇంత చక్కటి కార్యక్రమాలు చేపడుతున్న మన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలు అందరూ ఆశీర్వదించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఈశ్వరమ్మ కోరారు. ఐ.సి.డి.ఎస్ సిబ్బంది వారు నిర్వహించిన పౌష్టికాహారం నాణ్యతను మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న ప్రభుత్వ మెనూ ను అడిగి తెలుసుకున్నారు ఎలక్షన్స్ టైం లో జగనన్న ప్రవేశం పెట్టిన నవరత్నాలు హామీ శాతం అమలు చేసి ప్రజలు మన్ననలు పొందారని తెలియజేశారు. పురపాలక సంఘం పరిధిలో సచివాలయం లు యందు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటలో సహాయసహకారాలు అందించిన ఉప ముఖ్యమంత్రి వర్యులు మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర హృదయ పూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ డిప్యూటీ డి ఎం %డ% హెచ్ ఓ కే శివకుమార్ ఆధ్వర్యంలో డాక్టర్లు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సచివాలయం యందు దిగ్విజయంగా మున్సిపల్ కమిషనర్ టి జయరామ్ నడిపించారు.

ఈ కార్యక్రమం నకు వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు హాజరు అయ్యారు.9వ సచివాలయం నకు హాజరు అయిన ప్రజా ప్రతినిధులు మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు అందరూ పాల్గొన్నారు.

# అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజా ప్రణాళిక

**- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం**

విశాఖపట్నం : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యాన రూపొందించిన ప్రజా ప్రణాళికను గురువారం అనకాపల్లి పార్టీ కార్యాలయం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్నలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ నవంబరు 15న ప్రజారక్షణ భేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయని, శ్రీకాకుళం జిల్లా మందాస నుండి నవంబర్ 2న ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 5న జిల్లాలో పర్యటిస్తుందని పేర్కొన్నారు. విభజన హామీలను అమలు చేయాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏ ఒక్కటి అమలు చేయకుండా రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తోంది. ప్రత్యేక హొదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కు ఫాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజధాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, కడప ఉక్కు, రైల్వే జోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ అమలు కాలేదు. రాష్ట్ర ప్రజల్ని నిలువునా మోసం చేసిన బిజెపి అంతటితో ఆగకుండా మన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారైంది. బిజెపి పాలనలో మొత్తం దేశమే అస్తవ్యస్తంగా తయారైంది. బిజెపి బుల్డోజర్ రాజకీయాలతో అన్నదమ్ముల్లా సమైక్యంగా మెలగవలసిన ప్రజలమధ్య విద్వేషాలు రాజేస్తోంది. కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్ లను తెచ్చింది. దేశీయ వ్యవసాయానికి, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. రైతులు సాగించిన పోరాటం మీద తీవ్ర దమన కాండను ప్రయోగించింది. అయినా వెన్ను చూపని రైతన్నల పోరాట తెగువకు తలొగ్గి చివరికి ఆ చట్టాలను రద్దు చేసింది కాని ఆ సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మరోసారి రైతన్నలకు ద్రోహం చేస్తోంది.

తాను కూడా ఏమాత్రమూ తీసిపోనంటూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి కార్పొరేట్ సేవలో తరిస్తున్నారు. కృష్ణ పట్నం, గంగవరం మేజర్ పోర్టులతో బాటు రాష్ట్ర ప్రజల సంపదను ఒక్కొక్కటిగా అదానీకి నైవేద్యం పెడుతున్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసి విభజన హామీలకు ఎసరు పెట్టినా కేంద్రాన్ని పల్లెత్తు మాట కూడా అనడంలేదు. కేంద్రం చెప్పినట్టల్లా తలాడిస్తూ ప్రజలమీద మోయలేని భారాలను వడ్డిస్తున్నాడు. విద్యుత్ చార్జీల పెనుభారం ప్రజలపై రుద్దతున్నారు. స్మార్ట్ మీటర్లపేర, మోటార్లకు మీటర్లు పేరుతో, ఆస్తిపన్ను నుంచి చెత్త పన్ను దాకా అన్నీ వడ్డింపులలో ప్రజలపై భారాలు మోపుతున్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వాలను నిలదీయడానికి సిపిఎం ప్రజా రక్షణ భేరి మోగిస్తోంది. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# వక్ఫ్ బోర్డు స్థలం ఆక్రమించడం అవాస్తవం

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు బర్కత్ అలీ



మర్రిపాలెం(విజయభాను న్యూస్) : ఇటివలే రాష్ట ప్రభుత్వం తన సేవలను గుర్తించి వార్డు కార్పొరేటర్ గ ఉన్న తనకి రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించిందని బోర్డు సభ్యుడు జీవీఎంసీ 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. ఈమేరకు గురువారం వార్డు కార్యలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేస్తూ మాట్లాడారు ఇటివలే ఒక ప్రధాన పత్రికలో తనపై నిరాధార ఆరోణలు చేస్తూ "వక్ఫ్ బోర్డు సభ్యుడిగా స్థలం ఆక్రమణదారుడు" అనే శీర్షికన ను ప్రచురించిందని దీనిపై సంబందిత పత్రిక తో పాటుగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాష్ట్ర పతికి పిర్యాదు చేసిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్ మీరా పై న్యాయ పోరాటం చేస్తామన్నారు. వాస్తవానికి 2008 లో స్థానికంగా ఉన్న నలుగురు వక్తులు మర్రిపాలెం ప్రాంతంలో సర్వే నంబర్ 86 2B 1ఏ లో వారి పూర్వీకులకు సంబందించి 1400 గజాల స్థలాన్ని తనకు డవలప్ మెంట్ కు ఇచ్చారన్నారు. అయితే అప్పటిలో కొంత మంది వ్యక్తులు సదరు స్థలం స్థానిక మస్జిద్ చెందినదిగా వక్ఫ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో వక్ఫ్ బోర్డు అధికారులు సదరు స్థలం ప్రైవేట్ సర్వే నంబర్ కు చెందినదిగ వక్ఫ్ బోర్డు అధికారులు ధ్రువీకరించినట్లు బర్కత్ అలీ అంటున్నారు. ఇదిలా ఉండగ తనకు స్థలం డవలప్ మెంట్ కు ఇచ్చిన వ్యక్తులు న్యాయ స్థానాన్ని ఆశ్రయించడంతో 2009 లో వీరికి అనుకూలంగా తీర్పు రావడంతో జీవీఎంసీ అనుమతులు పొంది సదరు స్థలంలో నిర్మాణాలు పూర్తి చేసి విక్రయించడం జరిగిందని అందుకు సంబందించి తహశీల్దార్, వక్ఫ్ బోర్డు అధికారులు, జీవీఎంసీ అధికారులు జారీ చేసిన పత్రాలు తమవద్ద ఉన్నాయ న్నారు.

రాజకీయంగ తన ఎదుగుదలను వార్వలేక కొంత మంది తనపై లేని పోని ఆరోపణలు చేస్తూ దృష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు అటువంటి వారిపై న్యాయ పోరాటం చేస్తానని బర్కత్ అలీ అంటున్నారు.

# వైసీపీది పెత్తం దార్ల ప్రభుత్వం

**- వైసీపీది బస్సుయాత్ర కాదు తుస్సు యాత్ర**

**- నారా భువనేశ్వరి కి మద్దతుగా 'నిజం గెలవాలి' ప్లకార్డులతో కోండ్రు సంఘీభావం**



రాజాం : రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ వైసీపీ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన బస్సు యాత్ర కాదు ఇది తుస్సు యాత్ర అని విమర్శించారు.రాష్ట్రంలో వైసీపీ పెత్తం దార్ల ప్రభుత్వం నడుస్తోందన్నారు. తేదేపా అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేస్తున్న బస్సు యాత్రకు మద్దతుగా నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలిసి ప్లకార్డులతో కోండ్రు సంఘీభావం తెలిపారు.అనంతరం వైసీపి ప్రభుత్వం చేస్తున్న బస్సుయాత్ర పై కోండ్రు సంచలన వ్యాఖ్యలు చేశారు.దేనికోసం ఈ వైసీపీ సామాజిక సాధికారిక బస్సుయాత్ర ఎవరికోసం దేనికోసం అని ప్రశ్నించారు, కేవలం సీఎం సామాజిక వర్గం కు చెందిన వై.వి.సుబ్బారెడ్డి,విజయసాయిరెడ్డి ,పెద్దిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే రాష్ట్రాన్ని నాలుగున్నరేల్లుగా పాలిస్తున్నారన్నారు. ఈ రాష్ట్రాన్ని ఈ నాలుగు పెత్తందారులు మాత్రమే రాష్ట్రాన్ని పాలిస్తూ సంక్షోభంలోకి నెట్టారని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీ బీసీ మంత్రులు కేవలం దమ్మీలుగా మిగిలారన్నారు, ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన 33 వేల కోట్ల రూపాయల సబ్ ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమల్లించిందన్నారు.16 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో సంక్షేమం అమలు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పై అక్రమ స్కిల్ డెవలప్మెంట్ కేసు నమోదు చేసి సీఎం జగన్ మోహన్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు తరలేపారన్నారు,రాష్ట్రాన్ని ఇన్ఫ్రాస్ట్ స్ట్రక్చర్ లో నెంబర్ వన్ స్థాయికి చంద్రబాబు తీసుకెళ్ళింది నిజం కాదా. ఎస్సీ ఎస్టీ లకు 27 పథకాలు కేటాయించింది నిజం కాదా, రాష్ట్రంలో రైతులను ఆదుకోవడం నిజం కాదా, రాష్ట్రంలో 40 స్కిల్ సెంటర్లు ఆరు ఎక్సలెన్స్ సెంటర్లు పెట్టి యువతకు ఉద్యోగాలు ఇప్పించింది నిజం కాదా అని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, వైసీపీ ప్రభుత్వం చేస్తున్న బస్సు యాత్రని ప్రజలు ఛీదరించుకుంటున్నారని అన్నారు.భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా గుణపాఠం చెబుతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు, శాసపు రమేష్ కుమార్, మజ్జి శ్రీను, బనిశెట్టి వెంకటరమణ,ధనుంజయ, ముగ్గురామారావు, బెజ్జిపురపు రవి, ఎ శ్రీను, పి సత్యంనాయుడు, చిట్టి ,శ్రీను, భవిరి శ్రీను తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సోపేరులో జగనన్న ఆరోగ్య సురక్ష



రాజాం (విజయభాను న్యూస్) : మండలంలో సోపేరు గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైఎస్ఆర్సీపీ నేత డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ ప్రతినిధి లావేటి రాజగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొని ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు అందించారు.

## గడిముడిదాంలో ఈ క్రాప్ పై అవగాహన



రాజాం (విజయభాను న్యూస్) : మండలంలో గడిముడిదాం గ్రామపంచాయతీలో అగ్రికల్చరల్ ఈక్రాప్ విధానంపై అవగాహన సదస్సు బుధవారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ ప్రతినిధి లావేటి రాజగోపాలనాయుడు ఈ క్రాప్ వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. ఈ క్రాప్ తనిఖీ కొరకు ముసాయిదా జాబితాను గ్రామ సచివాలయం నోటీస్ బోర్డ్ నందు ఉంచడమైనది

## జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

శ్రీకాకుళం : జిల్లా లో బి.ఎస్.ఎన్.ఎల్ వినియోగదారులకు పారాదర్శకమైన, మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో అక్టోబరు 30వ తేది నుండి నవంబరు 5వ తేది వరకు బి.ఎస్.ఎన్.ఎల్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జనరల్ మేనేజర్ జె. శ్రీనివాస రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వారోత్సవాలు శ్రీకాకుళం కార్యాచరణ ప్రదేశంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బి.ఎస్.ఎన్.ఎల్ సంస్థకు సంబంధించిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని,తమ ఫిర్యాదులను ఉప మండల ఇంజనీర్ (విజిలెన్స్), జనరల్ మేనేజర్ కార్యాలయం, సంచార్ భవన్, శ్రీకాకుళంనకు స్వయంగా గాని, పోస్టల్ ద్వారా గాని అందజేయవచ్చునని ఆయన పేర్కొన్నారు.ఇతర వివరాలు, సందేహాలు కొరకు 08942-226700, 9441668789 నంబర్లకు సంప్రదించవచ్చునని తెలిపారు.

## భద్రత కలిగిన నగరాల్లో చెన్నైకి మొదటి స్థానం

ఎరంబూర్(చెన్నై): దేశంలో భద్రత కలిగిన మహానగరాల జాబితాలో చెన్నై మొదటి స్థానంలో నిలిచింది. 'గూగుల్' సంస్థ సాఫ్ట్వేర్ ఇంజనీర్, బోస్నియా - హెర్జెగొవీనా, బంజాలూకా విశ్వవిద్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ లేటన్ ఆడమోవిక్... సెర్బియాకు చెందిన 'నంబియో' అనే ప్రైవేటు సంస్థను నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ద్వారా ఆయన, ప్రపంచంలోని ముఖ్యనగరాల భద్రతపై సర్వే నిర్వహించారు. పలు సంస్థలు నిర్వహించిన సర్వేల ఆధారంగా, విధులకు వెళ్లే మహిళల భద్రత తదితర అంశాలపై సర్వే చేపట్టారు. ఆ సర్వే వివరాలు ఇటీవల విడుదల కాగా, భద్రత కలిగిన మహానగరాల జాబితాలో చెన్నై జాతీయస్థాయిలో మొదటి స్థానంలోను, అంతర్జాతీయస్థాయిలో 127వ స్థానంలో నిలిచింది. ఇక, ఈ ఏడాది ప్రారంభంలో 'అవతార్' అనే సంస్థ జీవన పరిస్థితులు, భద్రత, మహిళలకు ప్రాధాన్యం కల్పించే అంశాలు తదితరాలపై సర్వే నిర్వహించగా, అందులో 10 లక్షల మందికి పైగా ప్రజలు ఉన్న నగరాల జాబితాలో 78.4 పాయింట్లతో చెన్నై మహిళలకు అత్యంత భద్రత కల్పించే నగరంగా ఉన్నట్లు ప్రకటించారు. తాజాగా, దేశంలోనే భద్రత కలిగిన నగరంగా చెన్నై ఎంపిక కావడంపై నగర పోలీసుశాఖ హర్షం ప్రకటించింది. భవిష్యత్తులోనూ ప్రజలకు తగిన భద్రత కల్పించేలా కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# విజయభాను సంపాదకీయం

## లైంగికత సరిహద్దులు

స్త్రీ పురుషుల మధ్య మాత్రమే దాంపత్య, లైంగిక సంబంధాలను సహజమైనవిగా, ఆమోదనీయమైనవిగా పరిగణించడం ప్రపంచ వ్యాప్తంగా అనేక సమాజాలలో, సంస్కృతులలో ఉన్నది. భిన్న లైంగికతలు కలిగిన వారు తమ వైఖరుల గురించి న్యూన, అపరాధ భావాలతో ఉండడం, బయటకు చెప్పుకోలేక గోప్యత పాటించడం చూస్తాము. స్త్రీపురుష లైంగికత ఏకైకం కాదని, ఒకానొక పద్ధతి మాత్రమేనని, ఇతర లైంగికతలు కూడా ప్రాకృతిమైనవేననే స్పృహ క్రమంగా పెరుగుతున్నది. స్త్రీ స్వలింగ సంపర్కులు, పురుష స్వలింగ సంపర్కులు, లైంగికత మార్పిడిదశలో ఉన్న వారు, రెండు రకాల లైంగికతలు కలిగినవారు, ఇట్లా అనేక రకాల లైంగిక వ్యక్తిత్వాలు ప్రపంచమంతటా తమ అస్తిత్వానికి ఆత్మగౌరవభావనను జోడించి, హక్కుల కోసం చట్టబద్ధమైన గుర్తింపుల కోసం పోరాడుతున్నాయి. మంగళవారం నాడు భారత అత్యున్నత న్యాయస్థానం ప్రకటించిన తీర్పు కూడా ఆయా శ్రేణుల సామాజిక, న్యాయ పోరాటంలో ఒక మజిలీయే. విభిన్న లైంగికతలు కలిగినవారి మధ్య వివాహాలకు చట్టబద్ధత కల్పించడానికి, పిల్లలను దత్తత తీసుకోవడానికి ఆ జంటలను అనుమతించడానికి సుప్రీంకోర్టు మెజారిటీ తీర్పు అంగీకరించలేదు కానీ, బంతిని పార్లమెంటు గోదాలోకి బదిలీ చేసింది. తీర్పును వెలువరించే క్రమంలో ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌తో సహా ధర్మాసనంలోని తక్కిన నలుగురు న్యాయమూర్తులు అనేక ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన వ్యాఖ్యలు చేశారు.

1954 నాటి ప్రత్యేక వివాహాల చట్టంలోని సెక్షన్ 4 ఎవరెవరి మధ్య వివాహానికి చట్టబద్ధమైన అనుమతి ఉంటుందో నిర్వచించింది. దత్తతలను నియంత్రించే 'కారా' నియమావళిలోని 5(3) పిల్లలను పెంపకానికి తీసుకోవడానికి ఎవరెవరు అర్హులో చెబుతుంది. ప్రత్యేక లైంగికతలు కలిగినవారు వారు తమ భాగస్వామిని ఎంచుకున్నప్పుడు, ఆ జంటకు కూడా ఒక కుటుంబంగా చట్టబద్ధమైన గుర్తింపు, దానితో పాటు అనేక పౌరసదుపాయాలు సమకూరాలి. ఆ వివాహాన్నే చట్టం గుర్తించనప్పుడు వారికి రేషన్ కార్డు, ఆస్తి భాగస్వామ్యాలు, వారసత్వాలు ఎలా సమకూరతాయి? అటువంటి జంటల మీద వివక్ష చూపడం న్యాయమైనా? వారికి దత్తత తీసుకునే హక్కు లేకపోవడం అన్యాయం కదా? ఈ ప్రశ్నలతోనే ఎల్జీబీటీక్యూ (స్త్రీపురుష లైంగికతకు భిన్నమైన లైంగికతలు కలిగినవారిని ఉద్దేశించే సాముదాయిక పదం) ఉద్యమకారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

కేంద్రప్రభుత్వం ఆ అభ్యర్థనలను తిరస్కరించింది. ఈ భిన్న లైంగికతలన్నీ పట్టణ ప్రాంతాలకో, ఉన్నతవర్గాలకో చెందిన ధోరణులని వ్యాఖ్యానించింది. మంగళవారం నాడు మైనారిటీ తీర్పు ఇచ్చిన న్యాయమూర్తులలో ఒకరైన చంద్రచూడ్, ప్రభుత్వ వాదనను నిరాకరించారు. "భిన్న లైంగికతలు కలిగినవారు ఆంగ్లం మాట్లాడే పురుష ఉద్యోగి అయినా కావచ్చు, పల్లెల్లో వ్యవసాయ పనులు చేస్తున్న మహిళ అయినా అయి ఉండవచ్చు" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఏ ఇద్దరైనా సన్నిహితంగా జీవించదలచుకున్నప్పుడు, వారి మధ్య సంబంధానికి చట్టబద్ధత అనే కవచాన్ని కల్పించకపోతే, ఆ జంటలోని బలహీనులకు రక్షణ లేకుండా పోతుందని కూడా చంద్రచూడ్ హెచ్చరించారు. ప్రధానన్యాయమూర్తితో పాటు, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, విభిన్న లైంగికతలు కలిగిన జంటల సంబంధానికి చట్టబద్ధమైన గుర్తింపు కోసం స్పష్టమైన అభిప్రాయాన్ని చెప్పారు, ఆ జంటలు పిల్లలను దత్తత తీసుకోకుండా నిరోధించడం 'కారా' తన పరిధిని అతిక్రమించడమేనని కూడా వ్యాఖ్యానించారు. తక్కిన న్యాయమూర్తులు ఈ ఇద్దరితో ఏకీభవించలేదు. ఐదుగురు న్యాయమూర్తులు వెలువరించిన నాలుగు వేరు వేరు తీర్పులు అనేక విషయాలలో ఏకీభవించాయి, కొన్ని అంశాలలో విభేదించాయి.

వ్యక్తులుగా వారికి ఉండే అన్ని హక్కులూ సమకూరతాయి. వారి ప్రాథమిక హక్కులకు చట్టం రక్షణ ఇస్తుంది. జంటలుగా హక్కులు కావాలంటే మాత్రం దానికి శాసన నిర్మాణం కావాలి. విభిన్న లైంగికతలు కలిగిన జంటల సమస్యల మీద అధ్యయనం చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయడానికి కేంద్రప్రభుత్వం ఈ విచారణల సందర్భంగా అంగీకరించింది.

చట్టాలను చేసే పని పార్లమెంటుదే, కోర్టులది కాదు అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. స్త్రీపురుష ద్వంద్వం చుట్టూ మన సామాజిక విలువలు ఇంతకాలంగా పరిభ్రమిస్తున్నాయి కాబట్టి, ప్రజా ప్రతినిధులలో, విధాన నిర్ణేతలలో, ముఖ్యంగా సంస్కృతికి సంప్రదాయాలకు తనదైన తీరులో భాష్యం చెప్పే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలో మార్పు రావడం అంత సులువు కాదు, అంత తొందరగా జరిగేదీ కాదు. సామాజికమైన హేళనలనుంచి, సంక్షేమ అభివృద్ధి పథకాలలో వివక్ష నుంచి విభిన్న లైంగికతలతో ఉన్నవారికి రక్షణ కల్పించడానికి ఏ చట్టపరిమితులూ లేవు కాబట్టి, ప్రభుత్వం వాటి మీద దృష్టి పెట్టాలి. ఎల్జీబీటీక్యూ సమూహాలతో సంభాషిస్తూ, వారి ఆకాంక్షలను, అవసరాలను గుర్తిస్తూ, స్త్రీపురుష దాంపత్యాల మాదిరిగా వారి సంబంధాలకు కూడా సమాన గౌరవాన్ని, ప్రతిపత్తిని అందించే దిశగా విధాన ప్రయాణం జరగాలి. సుప్రీంకోర్టు తీర్పులోని 'నిరాకరణ' అంశాన్ని కాక, చట్టసభల మీద పెట్టిన బాధ్యతను ప్రధానమైనదిగా గ్రహించి కేంద్రప్రభుత్వం స్పందిస్తుందని ఆశిద్దాము.

## శిర్డీ సాయిబాబాను సందర్శించుకున్న ప్రధాని మోదీ



ముంబయి: ప్రధాని నరేంద్రమోదీగురువారం మహారాష్ట్రలో పర్యటించారు. ప్రసిద్ధ శిర్డీ సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద దర్శన్ క్యూ కాంప్లెక్స్‌ను ఆరంభించారు. ఈ పర్యటనలో ఆయన వెంట మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఉన్నారు. ఈ సందర్భంగా అహ్మద్‌నగర్ జిల్లాలోని నిల్వండే డ్యామ్‌కు జల పూజ చేశారు. ఆ తర్వాత డ్యామ్ ఎడమకాలువను ప్రారంభించారు. 85 కి.మీ. మేర పొడవైన ఈ కాలువ వల్ల 182 గ్రామాలు లబ్ధి పొందనున్నాయి. అలాగే 'నమో షెత్కారీ మహాసన్మాన్ నిధి యోజన'ను ఆవిష్కరించారు. ఈ పథకం వల్ల మహారాష్ట్రలో 86 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందనున్నారు. వైద్య, రవాణా, ఇంధనం.. ఇలా పలు రంగాలకు సంబంధించి రూ. 7,500 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభం, శంకుస్థాపన చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వ కేటాయింపులు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని వెల్లడించారు. మహారాష్ట్ర పర్యటన అనంతరం మోదీ గోవా వెళ్తారు. అక్కడ 37వ జాతీయ క్రీడల్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత క్రీడాకారుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని గోవా ప్రభుత్వం వెల్లడించింది. గోవా మొదటిసారి జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ క్రీడలు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 9 వరకు జరగనున్నాయి.

## 'అయోధ్య పిలుస్తోంది'.. రామ మందిరం వీడియో విడుదల చేసిన ట్రస్ట్



అయోధ్య: ఉత్తర్ ప్రదేశ్‌లోని అయోధ్య లో నిర్మిస్తున్న రామ మందిర నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాది జనవరి 22న ఆలయంలో దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్టించి కోవెలను ప్రారంభించనున్నట్లు ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. రామ మందిర ప్రారంభోత్సవానికి హాజరు కావాలంటూ ప్రధాని మోదీ ని శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ బుధవారం ఆహ్వానించిన సంగతి తెలిసిందే. తాజాగా గురువారం రామ మందిరం వీడియోను శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసింది. '500 ఏళ్ల పోరాటానికి ముగింపు' అని కామెంట్ చేసింది.

ఇందులో రామ మందిరానికి శిల్పకారులు తుది మెరుగులు దిద్దుతుండటం కనిపిస్తుంది. 'అయోధ్య పిలుస్తోంది' అనే బ్యాగ్రౌండ్ సంగీతంతో రూపొందించిన వీడియోలో ఆలయంలోని ద్వారాలు, గోపురం, పిల్లర్లు, ఫ్లోరింగ్‌తోపాటు మందిర నిర్మాణానికి ఉపయోగించిన భారీ యంత్రాలను చూడొచ్చు. మరో ఫ్రేమ్‌లో పిల్లర్లపై శిల్పకారులు దేవతా మూర్తుల విగ్రహాలను చెక్కుతుండటం కనిపిస్తుంది. రామ మందిరంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి నాలుగు వేల మంది సాధువులు, 2,500 మంది ప్రముఖులు హాజరుకానున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

## సమయం కవి

### దుష్టులకు దూరంగా వుండవలెను

దుష్టులతో స్నేహం చేస్తే మనకూ అదే విధమైన పేరు వస్తుంది. మీరు మంచివారయినా మీ సావాసగాళ్ళు చెడ్డవారైతే మిమ్మల్ని కూడా చెడ్డవారిగానే ఈ లోకం పరిగణిస్తుంది. తాడిచెట్టు క్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు తాగుతున్నాడనే అంటారు. అంటే దుష్టుల ఛాయకు అంత చెడ్డపేరు వుందన్నమాట. చెడ్డవారితో స్నేహం మొదలు బాగానే వుంటుంది. కానీ చివరకు వ్యసనాలను, అనేకమైన ఇతర దుర్గుణాలనూ నేర్పిస్తుంది. కాబట్టి చెడ్డవారికి దూరంగా వుండటం మంచిది. ఈ విషయాన్ని ఓ వేమన పద్యం ద్వారా విందాం.

'కానివానితోడు గలసి మెలుగుచున్న
గానివానివలెనె కాంతురవని
తాడిక్రిందుబాలు త్రాగిన చందమౌ
విశ్వదాభిరామ వినురవేమ'

... రచయిత
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

చతుర్దశి రా.తె.3.36
ఉత్తరాభాద్ర ఉ. 9.19 వ.రా. 8.40ల 10.10

శుక్రవారం
27-10 -2023

**మేషం :** కోళ్ళ, గొర్రె, పాడి పరిశ్రమ రంగాలలో వారికి పురోభివృద్ధి కాన వస్తుంది. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది. **వృషభం :** నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు. **మిథునం :** చిట్స్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి. కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. **కర్కాటకం :** విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బంది లెదుర్కో వలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం. **సింహం :** ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదిం పులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి. **కన్య :** పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ సంతానం విద్య, వివాహ విషయాల పట్ల శ్రద్ధ కనబరుస్తారు. **తుల :** మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరో గ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం. **వృశ్చికం :** ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహకారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం. **ధనుస్సు :** మీరంటే అందరికీ గౌరవం ఏర్పడుతుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు. **మకరం :** దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కాను కలు, శుభాకాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తి కరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపు నపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం. **కుంభం :**భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం. ఏదైనా స్థిరాస్తి అమ్మకం చేయాలనే మీ ఆలోచన మరి కొంత కాలం వాయిదా వేయడం మంచిది. **మీనం :** ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపార స్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగు మతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసి వస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

## పురాణాలలో స్త్రీ పురుష అంతర్భేద కథలు



భారత దేశంలో స్త్రీల పట్ల వివక్ష చూపిస్తారని ఒక అపవాదు ఉంది. కానీ మీరు చరిత్ర ని తిరగేస్తే ఇది నిజం కాదని స్పష్టమవుతుంది. పురాణాలలో ఈ సంప్రదాయానికి వ్యతిరేక ఉదాహరణలు బోలెడు కనిపిస్తాయి. అనేక సందర్భాలలో స్త్రీ పురుష తత్వాల మధ్య విభజన రేఖ అస్పష్టం గా ఉండటం మీకు కనపడుతుంది..పురాతన కవులు, రచయితలు ఈ స్త్రీ పురుష వివక్ష ని ధైర్యంగా తరచి చూసి ఒక్కోసారి మార్చడానికి కూడా ప్రయత్నించారు. మీ కర్మానుసారం మీరు ఆడ, మగ గానో, జంతువుగానో లేదా చెట్టుగానో పుడతారు. ఎలా పుట్టినా మృత్యు సమయం లో ఆత్మ జీర్ణ వస్త్రాన్ని విడిచిపెట్టినట్లు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళిపోతుంది. అందుకే ఆత్మ స్త్రీ లేదా పురుష లింగం కాదు. ఇప్పుడు మనం హిందూ పురాణాలలో లింగ వివక్ష కి అందని కథలు చూద్దాము. ఈ కథలలో మగవారు ఆడవారి పాత్ర పోషించడానికి సిద్ధపడ్డ సంఘటనలు,మగవారు గా బ్రతికిన ఆడవారు,ఇంకా ఆడా మగా ఒకటే అని నిరూపించే కథలని చూద్దాము. ఇవి చదివి మీ భావాలని, కామెంట్లని దిగువ తెలియ చెయ్యడానికి సంకోచించకండి.

**అర్ధనారీశ్వరుడు:** అర్ధనారీశ్వర శబ్దానికి సగం స్త్రీ సగం పురుష తత్వం కలిగిన భగవంతుడని అర్థం. మహా శివుడు మరియు ఆయన దేవేరి పార్వతి యొక్క ఏక రూపం ఈ అర్ధనారీశ్వరం. ఈ రూపం పురుష స్త్రీ తత్వాల ఏకీకరణకి ప్రతీక. ఒకళ్ళు లేకుండా ఇంకొకళ్ళు లేరూని, ఒకళ్ళు ఇంకొకళ్ళ కంటే ఎక్కువ కాదు అనీ, మరియు తనలో ఈ రెండు లక్షణాలనీ ఉంచుకున్నవాడే పరిపూర్ణ జీవితం గడపవచ్చనీ ఈ రూపం మనకి తెలియచేస్తుంది.

మోహిని శ్రీ మహా విష్ణువు అవతారం గా మోహినీ అవతారం మనకి హిందూ పురాణాలలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ రూపాన్ని గురించి మూడు ముఖ్య కథలు చెప్తారు. మొదటిది సాగర మథనం తరువాత అమృతానికి సంబంధించిన తగవు తీర్చడానికి వచ్చిన రూపం. శ్రీ మహా విష్ణువు అందమైన మోహినీ రూపం ధరించి తెలివిగా అమృతాన్ని దేవతలకి మాత్రం పంచుతాడు. రెండోది పరమేశ్వరుణ్ణి భస్మాసురుడు అనే రాక్షసుడి బారి నుండీ కాపాడిన మోహినీ అవతారం.ఈ మనోహరమైన మోహినీ అవతారం భస్మాసురుడు తననను తాను అంతం చేసుకు నేటట్లు చేసింది. మనోహరమైన మోహినిని పరమేశ్వరుడు మోహించడం వల్ల అయ్యప్ప జననమయ్యింది. అయ్యప్ప దక్షిణ భారతం లో ప్రసిద్ధి చెందిన భగవత్ స్వరూపం. ఇంక మూడోది మహా భారతంలో. అర్జునుడి కొడుకైన అరవనుణ్ణి యుద్ధం లో పాండవుల విజయం కోసం బలి ఇవ్వ వలసి వస్తుంది.కానీ అరవణుడికి చనిపోయే ముందు వైవాహిక సుఖాలని అనుభవిం చాలని కోరిక ఉంటుంది.కానీ చావు రాసి పెట్టి ఉన్న ఈ మనిషి ని పెళ్ళాడేందుకు ఏ స్త్రీ ముందుకురాకపోయేసరికి శ్రీ కృష్ణుడే మోహిని గా మారి అరవనుణ్ణి పెళ్ళాడి అతను చనిపోయాకా దఃఖిస్తాడు.

శిఖండి ద్రుపద మహారాజుకి కుమార్తె గా పుట్టిన శిఖండి ని మగ పిల్లవాడిలాగ పెంచుతారు. కొన్ని కథల ప్రకారం శిఖండి కి అమ్మాయినిచ్చి పెళ్ళి చేసారుట కూడా. శిఖండి తన స్త్రీ తత్వాన్ని

### సంకీర్తన

తాను వైవాహిక జీవితం గడపడానికీ , భీష్ముడిని చంపటానికీ ఒక యక్షునికిచ్చినట్లు కూడా కొన్ని కథలు ప్రచారం లో ఉన్నాయి. చాలా కథల ద్వారా శిఖండి ఆడా ఉభయ లింగం అని తెలుస్తుం ది. బృహన్నల తనని తిరస్కరించాడన్న కోపం తో ఊర్వశి అర్జునుడిని ఒక సంవత్సరం స్త్రీగా మారతాడని శపిస్తుంది.కానీ ఈ శాపం అజ్ఞాతవాసం ఆఖరి సంవత్సరం లో విరాట మహారాజు కొలువులో బృహన్నల అనే స్త్రీలా ఉండటానికి ఒక వరంలా పనికొచ్చింది. కానీ కొంతమంది ఆ శాపం వల్ల అర్జునుడు స్త్రీగా కాకుండా నపుంసకుడిగా మారాడని కూడా అంటారు.

సుద్యుమ్న/ఇల పరమశివుడి తోట లోకి అనుమతి లేకుండా పొరపాటున ప్రవేశించడం వల్ల తన జీవితం లో సగ భాగం స్త్రీగా మారతాడని మగవాడిగా పుట్టిన సుద్యుమ్నుడికి శాపం వచ్చింది. అతను ప్రతీ నెలా తన తత్వాన్ని(లింగాన్ని) మార్చుకుంటుం డేవాడు. అతని స్త్రీ స్వరూపాన్ని ఇల గా వ్యవహరిస్తారు.

# బరువు తగ్గించే రాగి అంబలితో ఎన్నో లాభాలు..!

**ధాన్యపు గింజలైన రాగుల్లో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. అవి మన శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే రాగులతో తయారు చేసే అంబలిని తాగడం వల్ల మనకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ప్రధానంగా బరువు తగ్గుతారు. ఇంకా చాలా లాభాలే ఉన్నాయి. ఈ క్రమంలో రాగి అంబలిని ఎలా తయారు చేయాలో, దాంతో మనకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.**



రాగులను కొంత పరిమాణంలో తీసుకుని వాటిని కొన్ని గంటల పాటు నీటిలో నానబెట్టాలి. అనంతరం వాటిని శుభ్రమైన వస్త్రంలో కట్టి మళ్లీ కొన్ని గంటల పాటు ఉంచితే అవి మొలకెత్తుతాయి. కొన్ని సార్లు రాగులు మొలకెత్తడం ఆలస్యం కూడా అవచ్చు. అయినా కొంత సేపు నిరీక్షించి మొలకెత్తిన రాగులను సేకరించాలి. వాటిని బాగా ఎండబెట్టి దంచి పొడి చేయాలి. ఆ పొడిని కొంత నీటిలో వేసి బాగా ఉడికించాలి. దీంతో జావ తయారవుతుంది. ఇందులో అవసరం అయితే జీడిపప్పు, పల్లీలు, కిస్మిస్, తేనె వంటివి కలుపుకోవచ్చు. లేదంటే ఉప్పు, కారం కూడా కలపవచ్చు. అలా కలుపగా వచ్చేదే రాగి అంబలి. దీన్ని నిత్యం తాగితే మన శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది.

1. రాగి అంబలి శరీరానికి మంచి బలాన్ని ఇస్తుంది. రోజంతా శరీరానికి కావల్సిన శక్తి, పోషకాలు రాగి అంబలి ద్వారా అందుతాయి. దీంతో ఎక్కువ సేపు పనిచేయవచ్చు. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

2. ఎదిగే పిల్లలకు దీనిని ఇవ్వడం వల్ల శక్తివంతంగా తయారవుతారు. చదువుల్లో బాగా ప్రతిభను కనబరుస్తారు. మెదడు చురుగ్గా ఉంటుంది.

3. రాగి అంబలికి చలువ చేసే గుణం ఉంది. దీంతో శరీరంలో ఉండే అధిక వేడిని తగ్గించుకోవచ్చు.

4. ఒక గ్లాస్ రాగి అంబలి తాగినా చాలా సేపు ఆకలి వేయదు. దీంతో కడుపు నిండిన భావన కలుగుతుంది. ఆహారం ఎక్కువగా తినాలనిపించదు. ఇది బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. స్థూలకాయం ఉన్న వారు రాగి అంబలి తాగితే వేగంగా బరువు తగ్గవచ్చు.

5. ప్రతి రోజూ ఉదయం చేసే సాధారణ అల్పాహారానికి బదులుగా రాగి అంబలి తాగితే దాంతో మనం రోజంతా యాక్టివ్‌గా ఉండవచ్చు. శారీరక ద ృఢత్వం చేకూరుతుంది.

6. బీపీ, షుగర్ నియంత్రణలోకి వస్తాయి. రక్తస్రావం జరుగుతున్న వారికి రాగి అంబలి తాగిస్తే స్రావం ఆగిపోతుంది.

7. రాగి అంబలిని నిత్యం తాగుతుంటే పురుషుల్లో వీర్యం వ ృద్ధి చెందుతుంది.




# అనారోగ్య సమస్యలను మటుమాయం చేసే నువ్వుల నూనె...

**ఇప్పుడంటే అన్నీ రిఫైన్డ్ నూనెలు వచ్చాయి కానీ ఒకప్పుడు మన వాళ్లు గానుగల్లో ఆడించిన నూనెలనే ఎక్కువగా వాడేవారు. అలాంటి నూనెల్లో నువ్వుల నూనె కూడా ఒకటి. తెల్లనివి, నల్లనివి అని రెండు రకాలుగా ఈ నువ్వులు ఉంటాయి. వీటి నుంచి తీసే నూనెలో ఎన్నో రకాల పోషక పదార్థాలు ఉంటాయి. మన శరీరానికి అవసరమైన విటమిన్ ఇ, కాల్షియం, జింక్, ఐరన్, థయామిన్, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో మనకు పుష్కలంగా లభిస్తాయి. ఈ క్రమంలో నువ్వుల నూనెను నిత్యం మన ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**



1. నువ్వుల నూనెలో విటమిన్ ఇ, బిలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మాన్ని సంరక్షించడమే కాదు, అన్ని రకాల చర్మ సమస్యలను దూరం చేస్తాయి. నువ్వుల నూనెను తరచూ వాడడం వల్ల ముఖం కాంతివంతమవుతుంది. చర్మం మ ృదువుగా మారుతుంది.

2. నిత్యం స్నానం చేసే ముందు చిన్న పిల్లలకు నువ్వుల నూనెతో మర్దనా చేస్తే వారి శరీరం బాగా ఎదుగుతుంది. మెదడు పదునుగా మారుతుంది. చిన్నారుల్లో ఉండే కొవ్వు కరిగిపోతుంది. ఈ నూనెలో ఉండే పోషకాలన్నీ పిల్లలకు లభిస్తాయి. అయితే పెద్దలు కూడా స్నానానికి ముందు నువ్వుల నూనెతో మర్దనా చేసుకోవచ్చు.

3. నువ్వుల నూనెలో ఒమెగా-3,6 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బీపీని తగ్గిస్తాయి. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ నిల్వలను తగ్గిస్తాయి.

4. కాపర్, ఇతర పవర్‌ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు నువ్వుల నూనెలో ఉంటాయి. దీంతో ఇవి కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి.

కొద్దిగా నువ్వుల నూనెను తీసుకుని కొంచెం వేడి చేసి మోకాళ్లపై రాసుకుంటే నొప్పులు, వాపులు తగ్గిపోతాయి.

5. పైన చెప్పిన విధంగా నువ్వుల నూనెను శరీరంపై కొవ్వు ఉన్న ప్రాంతాల్లో రాస్తే అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది.

6. నువ్వుల నూనెలో ఉండే పోషకాలు ఎముకలకు ద ృఢత్వాన్ని ఇస్తాయి. రక్తనాళాలను శుభ్రం చేస్తాయి. శ్వాసకోశ సమస్యలను దూరం చేస్తాయి.

7. మధుమేహ వ్యాధి గ్రస్తులు నిత్యం 2 టేబుల్ స్పూన్ల మోతాదులో నువ్వుల నూనెను ఏవిధంగానైనా తీసుకుంటే వారి శరీరంలోని రక్తంలో ఉండే చక్కెర స్థాయిలు తగ్గుముఖం పడతాయి. దీని వల్ల షుగర్ నియంత్రణలో ఉంటుంది.

8. నువ్వుల నూనెతో తలకు మర్దనా చేస్తే జుట్టు బాగా పెరుగుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. చుండ్రు సమస్య పోతుంది.

# చిన్నారుల్లో డిప్రెషన్

ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది. ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.



ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రోటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి.

దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది.

అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు. ఆహారాన్ని తీసుకోవడంలోనూ సమయపాలన తప్పనిసరి.

# మహిమాన్వితం.. శివగంగ ఆలయం

పద్మాకారంలో ఆలయం. కింద గం గమ్మ.. మధ్యన రాజరాజేశ్వరి మాత..ఆ పైన త్రినేత్రుడు కొలువుదీరిన మహాదుతేమైన చోటు. చుట్టూ పద్మరేకుల్లా చిన్నచిన్న శివాలయాలు.., రావి, వేప, మేడి చెట్లు అల్లుకొని త్రివ ృక్షమై బాసిల్లుతున్న ప్రాంతం..అదే మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఈ అల యం దినదినాభివ ృద్ధి చెందుతూ..భక్తుల కొంగుబంగారమై అలలారుతోంది. ఈకోవెల 6తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. - మహేశ్వరం



కాకతీయుల కాలంలో రాజరాజేశ్వరస్వామి ఆలయం నెలకొల్పడంతో ఈ గ్రామానికి మహేశ్వరం అని పేరు వచ్చింది. శివగంగలో కొలువుదీరిన ఈ ఆలయం సందర్శకులను ఇట్టె కట్టిపడేస్తుంది. ఈ ఆలయ నిర్మాణం పద్మాకారంలో ఉంటుంది. దీనిచుట్టూ శ్రీహరిహరేశ్వరుడు, శ్రీమల్లీశ్వరుడు, శ్రీఅవిముక్తేశ్వరుడు, శ్రీఅఘోరేశ్వరుడు, శ్రీఅమరేశ్వరుడు, శ్రీఅమ ృతేశ్వరుడు, శ్రీగంగాధేశ్వరుడు, శ్రీఇష్టకామేశ్వరుడు, శ్రీముకేశ్వరుడు, శ్రీకాళహస్తీశ్వరుడు, శ్రీఏకాంబేశ్వరుడు, శ్రీమణికరి?కేశ్వరుడు, శ్రీమహానందీశ్వరుడు, శ్రీఅమరావతీశ్వరుడు, శ్రీకాశీపతీశ్వరుడు, శ్రీమంగళగౌరీశ్వరుడు ఆలయాలు పదరేకుల్లా ఉంటాయి.

ఆలయంలోని అష్టాదశంగా (18 సంఖ్య వచ్చేలా) నిర్మించడం విశేషం. సహజంగా శివుడి తలపై గంగ ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగలోనే శివుడు ఉండడంతో ఆయన కింది భాగంలోనే రాజేశ్వరీ దేవి విగ్రహాన్ని ప్రతిషి'ంచారు. ఈ శివగంగలో స్నానమాచరిస్తే వారి దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

**చరిత్రకు నిలువుటద్దం గడికోట**

కాకతీయుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా ఆలయం పక్కనే గడికోట నిర్మాణం నేటికీ నిలిచి ఉంది. కొంత శిథిలావస్థకు చేరినప్పటికీ కోటలోని కట్టడాలు నేటికి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. గడికోట చుట్టూ ఆర్చ్‌లతో పాటు మధ్యలో ఉన్న కొలను ను అదుతేంగా నిర్మించారు.

**మహత్యం..త్రివ ృక్షం...:**

ఆలయం ముందున్న చెట్టుకు ఓ చరిత్ర ఉంది. రావి, వేప, మేడి చెట్లు ఒకేచోట పెరగడంతో దీన్ని తివ ృక్ష చెట్టుగా పిలుస్తారు. పిల్లలు కానివారు ఈ చెట్లకు కొత్త కొబ్బరికాయ కట్టితే పిల్లలు పుడుతారని నమ్మకం. ఈవ ృక్షం కిందనే నాగేంద్రాలయం ఉంది.

**శివగంగకు దారి ఇలా..:**

ఆలయం హైదరాబాద్ నుంచి 25 కిలో మీటర్లు దూరంలో ఉంటుంది. ఫలక్‌నుమా, మిధాని, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ డిపోల నుంచి బస్సు సౌకర్యం ఉంది. జూబ్లీబస్ స్టేషన్ నుంచి మహేశ్వరానికి 253/ 90కె, చార్మినార్ నుంచి 253 ఎం, 253 కె, 253 టి, 253 హెచ్, సికింద్రాబాద్ నుంచి 8ఎ/ 253ఎం. జూబ్లీహిల్స్ నుంచి 253 ఎం, బస్సులు ఎక్కాలి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఔటర్‌రింగ్ రోడ్డు మీది నుంచి తుక్కుగూడ వరకు వచ్చి శ్రీశైలం రహదారి మీదుగా మహేశ్వరం గేట్ కమాన్ నుంచి ఆలయానికి చేరుకోవచ్చు.

**ఆలయ చరిత్ర...**

తానీషా నవాబుల వద్ద పని చేసిన అక్కన్న మాదన్నలు 1672లో వారి పర్యటనలో భాగంగా శిథిలావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి రాజధాని గోల్కొండ కోటకు పశ్చిమ భాగాన 37 కిలో మీటర్ల దూరంలో ఈ దేవాలయం ఉంది. శంషాబాద్ మండలంలోని చిన గోల్కొండ, పెద్ద గోల్కొండ గ్రామాల మీదుగా అక్కన్న ,మాదన్నలు ఇక్కడికి చేరుకునేవారట.

మహేశ్వరం ఆలయంతో పాటు సమీపంలోనే కోదండరామస్వామి ఆలయం, శివగంగ పుష్కరిణి, విషు? భగవాన్, ఆంజనేయస్వామి ఆలయాలను సైతం అక్కన్న మాదన్నలు నిర్మించినట్లు ప్రతీతి . ఎనిమిదేళ్ల కాలంలో వీటి నిర్మాణం పూర్తయినట్లు చరిత్ర చెబుతోంది. 1677లో ఈ ఆలయం పునర్‌నిర్మాణంలో ఉన్నప్పుడు శ్రీశైలం దర్శనానికి వెళ్లిన శివాజీ కూడా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని వెళ్లినట్లు చరిత్ర చెబుతుంది. 1687లో ఔరంగజేబు దాడిలో గుడిని ధ్వంసమైనట్లు చెబుతుంటారు.



## ఉమ్మడి విశాఖ నూతన ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా పోలి నాయుడు



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : విశాఖపట్నం, అక్టోబర్,26. రాష్ట్రంలోని అతిపెద్ద నగరం విశాఖ నూతన ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా గురువారం నాడు ఎం.పోలినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. విశాఖ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# యువత వారానికి 70 గంటలు పనిచేయాలి : ఇన్ఫీ నారాయణ మూర్తి

బెంగళూరు: ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి అన్నారు. అప్పుడే అభివృద్ధి చెందిన దేశాల సరసన భారత్ నిలవలగలదని వ్యాఖ్యానించారు. ఈ మేరకు 3వన్4 క్యాపిటల్ తొలి పాడ్‌కాస్ట్ 'ది రికార్డ్' అనే ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణం, టెక్నాలజీ, ఇన్ఫోసిస్ సహా పలు అంశాల గురించి మాట్లాడారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే దేశంలో ఉత్పాదకత తక్కువని నారాయణ మూర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందుకే దేశ యువత మరిన్ని గంటలు అధికంగా శ్రమించాలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్, జర్మనీ వంటి దేశాలు ఎలాగైతే కష్టపడ్డాయో.. చైనా వంటి దేశాలతో పోటీపడాలంటే యువత అదే తరహాలో పనిచేయాల్సిన అవసరం ఉందని నారాయణ మూర్తి అన్నారు. "ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో ఉత్పాదకత చాలా తక్కువ. మన దేశంలో ఉత్పాదకత పెరగకుండా.. ప్రభుత్వంలో ఒక స్థాయిలో వేళ్లూనుకున్న అవినీతిని తగ్గించకుండా.. అధికార నిర్ణయాల్లో జాప్యం తొలగకుండా.. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడడం సాధ్యం కాదు. కాబట్టి 'యువత ఇదీ నా దేశం. నా దేశం కోసం వారానికి 70 గంటలు కష్టపడతాను' అనే ప్రతిజ్ఞ తీసుకోవాలి" అని నారాయణమూర్తి అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మన్లు, జపానీయులు ఇదే పనిచేశాయన్నారు. ప్రతి జర్మన్ అదనపు గంటలు పనిచేయాలని నిర్ణయించుకుని కొన్నేళ్ల పాటు ఆ పనిచేశారని గుర్తుచేశారు.

# నైపుణ్యాలుగల వారికే ఉద్యోగ అవకాశాలు

## గీతం హెచ్ఆర్ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమల నిపుణులు




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** కోవిడ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రంగం, ఉక్రేన్-రష్యా యుద్ధం తదితర పరిణామాల నేపద్యంలో వివిధ కంపెనీల నియామకపు ప్రక్రియలో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యంగా నైపుణ్యాలుగల వారికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వివిధ పరిశ్రమల నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమాన్ని గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పరిశ్రమలకు విద్యాలయాలతో మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులు చేయవచ్చునన్నారు. శాప్ ల్యాబ్స్ డైరక్టర్ కమల్ స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితులకు తగిన విధంగా తమను మలచుకోవవాలని, నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ఐబిఎమ్ లోకల్ హెడ్ ఎ.అనురాధ, కాగ్నిజెంట్ సీనియర్ డైరక్టర్ సి.సుబ్రహ్మణ్యం, ఇన్‌టెల్ బిజినెస్ మేనేజర్ హెచ్.గిరీష్, బ్రాండిక్స్ టేలంట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ షెహజాది, అమర్‌రాజా గ్రూప్ బిజినెస్ హెచ్ఆర్ రవికుమార్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ మేనేజర్ జాక్సన్ జాన్సన్, ఆల్‌స్టామ్ డైరక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రొఫెసర్ సి.శాంతి, ప్రొఫెసర్ బి.రవికిషోర్ సంధానకర్తలుగా వ్యవహరించారు. విద్యార్థులలో నాయకత్వలక్షణాలు, తాము చదివే కోర్సు పట్ల లోతైన అవగాహన, బృందాలుగా పనిచేసే సామర్థ్యం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకునే తత్వం అవసరమని పరిశ్రమల నిపుణులు సూచించారు.

# ఉప రాష్ట్రపతి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు గావించాలి

## అధికారులకు దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఎ. మల్లిఖార్జున



విశాఖపట్నం : భారత ఉప రాష్ట్రపతి జిల్లాకు రానున్న సందర్భంగా ఏర్పాట్లు పక్కాగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.మల్లిఖార్జున అధికారులకు సూచించారు. ఈ నెల 28వ తేదీన భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ జిల్లాలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నందున అందుకు అవసరమైన ఏర్పాట్లు విషయమై జిల్లా కలెక్టర్ పోలీస్ కమీషనర్ ఎ.రవిశంకర్ తో కలిసి గురువారం సాయంత్రం ఎ.ఎస్.ఎల్ నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా ఐఎన్ఎస్ డేగాలో ఉప రాష్ట్రపతికి రిసెప్షన్ మరియు పర్యటన ఏర్పాట్లు విషయమై నేవీ అధికారులతో చర్చించారు. తదుపరి ఎఎంసి చేరుకొని అక్కడ పైలాన్, ప్లాంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ , ఫొటో సెషన్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎంసి ప్రిన్సిపాల్ డా.బుచ్చిబాబుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. తదుపరి ఏ.యు కన్వెన్షన్ సెంటరులో ఎఎంసి శతాబ్ది వేడుకల ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ పర్యటన కార్యక్రమంలో నేవల్ అధికారులు, పోలీస్ అధికారులు,ఎఎంసి కళాశాల ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డా. పి.అశోక్ కుమార్ , పలువురు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆంధ్ర మెడికల్ కాలేజ్ పరిసరాలను పరిశుభ్రపరచండి

## జీవిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : మహావిశాఖ నగరపాలక సంస్థ పరిధిలో గల ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాలకు అక్టోబర్ 28న భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్ విశాఖ నగరానికి రానున్నందున ఆంధ్ర వైద్య కళాశాల ఆవరణ పరిసరాలను పరిశుభ్రపరచాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆవరణలో గల ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాలను జివిఎంసి అధికారులతో కలసి పరిశీలించారు. ఈ పరిశీలనలో కమిషనర్ మాట్లాడుతూ, విశాఖ నగరంలో గల ఆంధ్ర వైద్య కళాశాల 1923లో స్థాపింపబడి 2023 సంవత్సరం నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటుందన్నారు. ఈ శతాబ్ది ఉత్సవాలకు భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధనఖర్ విశాఖ నగరానికి విచ్చేసి కింగ్ జార్జ్ ఆసుపత్రి నందుగల ఆంధ్ర వైద్య కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అత్యాధునిక భవన నిర్మాణ ప్రాంగణంలో డాక్టర్ ఎల్లాప్రగడ రీసెర్చ్ సెంటర్ కు సంబంధించిన ఫ్లేక్ ను అక్టోబర్ 28వ తేదీన ఆవిష్కరణ చేసి, పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నందున, ఆంధ్ర వైద్య కళాశాల భవనాన్ని, పరిసరాలను కమిషనర్ పరిశీలించారు. కేజిహెచ్ నందు ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల నందు పరిశుభ్రత కార్యక్రమాలను, ఆ ఆవరణ రహదారిలో వ్యర్థాలను తరలించి పరిశుభ్రపరచి, చిన్న చిన్న మరమ్మతు పనులను, పెయింటింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజు కు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్ కు కమిషనర్ ఆదేశించారు. ఆంధ్ర వైద్య కళాశాల భవనం లో లైటింగ్ పనులను, పెయింటింగ్ పనులను, మరమ్మతు పనులను వెంటనే పూర్తిచేసి అందంగా తీర్చిదిద్దాలని ఆంధ్ర వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నకు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏ.ఎం.ఓ.హెచ్ డాక్టర్ రాజేష్ ,డిఇఇ స్వాతి, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జల వనరుల సంరక్షణ, నిర్వహణపై నవంబర్ 2 నుంచి అంతర్జాతీయ సదస్సు

## పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** : వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కార మార్గాలు, సాగునీటి కొరత లేని విధానాల రూపకల్పన, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జల వనరుల నిర్వహణ తదితర అంశాలపై విశాఖపట్టణంలోని ర్యాడిసన్ బ్లూ హొటల్ వేదికగా అంతర్జాతీయ సదస్సు జరగనుందని, పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) పేర్లతో స్థానిక ర్యాడిసన్ బ్లూ హొటల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు. నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సంబంధిత కార్యక్రమాల వివరాలను వెల్లడిస్తూ ఏయే విభాగాల అధికారులు ఏయే చర్యలు చేపట్టాలో సూచనలు చేశారు. సదస్సు నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేశారు. సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా 90 దేశాల నుంచి అతిథులు, ఐసీఐడీ (ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ), ఐఎన్ఐసీడీ (ఇండియన్ నేషనల్ కమిటీ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ), సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్)ల నుంచి ఉన్నతాధికారులు, సభ్యులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. భద్రతాపరమైన, నిర్వహణ పరమైన ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఇదిలా ఉండగా సదస్సుకు హాజరయ్యే అతిథుల్లో సుమారు 300 మంది స్థానిక పర్యాటక ప్రాంతాలను, అరకు, తాటిపూడి రిజర్వాయర్లను సందర్శిస్తారని ఇరిగేషన్ ఈఈ ఉమేష్ కుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర దేశాల నుంచి వచ్చే వారి వివరాలు, వారి బస వివరాలను పోలీసు శాఖకు ముందుగా తెలియ జేయాలని చెప్పారు.

సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ. రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఇరిగేషన్ ఈఈ ఉమేశ్ కుమార్, ఆర్డీవోలు, పోలీసు, ఎయిర్ పోర్టు అథారిటీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.. వైమానిక కమాండర్లకు రాజ్‌నాథ్ సింగ్ పిలుపు

న్యూఢిల్లీ: కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వైమానిక దళ కమాండర్లకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. రెండు రోజులు పాటు జరిగే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) కమాండర్ల కాన్ఫరెన్స్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైమానిక దళ టాప్ కమాండర్ల నుద్దేశించి రాజనాథ్ సింగ్ ప్రసంగించారు. వేగంగా మారుతున్న ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులను పరిశీలించాలని తెలిపారు. భారత్ రక్షణపరంగా వాటిని అంచనా వేయాలని, ఆ మేరకు కార్యాచరణ సంసిద్ధతను పెంపొందించుకోవాలని అన్నారు. భారత వైమానిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంతోపాటు డ్రోన్‌ల వినియోగంపై దృష్టి సారించాలని ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు సూచించారు. కాగా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ నేపథ్యంలో వివిధ వైమానిక వేదికల వినియోగాన్ని భారత్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్లు విస్తృతంగా విశ్లేషిస్తున్నారని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, గ్లోబల్ సెక్యూరిటీ దృష్ట్యా కొత్త సవాళ్లు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. వాటిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని భారత వైమానిక దళ కమాండర్లకు సూచించారు. త్రివిధ దళాలు ఉమ్మడిగా ప్రణాళికలు, కార్యకలాపాలు అమలు చేయాలన్నారు.

మరోవైపు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, ఇతర కమాండర్లతో కలసి చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో భద్రతా పరిస్థితిని రాజ్‌నాథ్ సింగ్ సమీక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఎయిర్‌ఫోర్స్ డే పరేడ్, వైమానిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించినందుకు ఐఏఎఫ్‌ను అభినందించారు. అలాగే హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో మానవతా సహాయం, విపత్తు సహాయ మిషన్లలో ఐఏఎఫ్ పాత్రను ప్రశంసించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com